క్లుప్తంగా

345 మందికి కొత్తగా పింఛన్లు

సామర్లకోట: వైఎస్సార్ సీపీ అధికారంలోనికి వచ్చిన తరువాత ప్రతి ఆరు నెలలకు ఒకసారి కొత్త పింఛన్లను మంజూరు చేస్తుంది. ఇందులో భాగంగా జనవరిలో మున్సిపాలిటీ, మండలానికి సంబంధించి 345 మందికి పింఛన్లు మంజూరు చేశారు. ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ సొమ్మును రూ.మూడు వేలకు పెంచారు. మున్సిపాలిటీలో 107 మందికి కొత్తగా వైఎస్సార్ పింఛన్ల కానుక అందుతుందని కమిషనర్ జె.రామారావు తెలిపారు. డిసెంబరు వరకూ 6,548 మంది పింఛనుదారులకు రూ.1,82,83,250 సొమ్ము అందిస్తున్నారు. జనవరి నుంచి మొత్తం 6,655 మందికి రూ.1,99,65,000 అందించనున్నారు. మండలానికి కొత్తగా 238 పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీడీఓ డి.శ్రీలలిత తెలిపారు.

ఈవీఎంలపై అవగాహన



సామర్లకోటలో ఈవీఎంల వినియోగంపై వివరిస్తున్న సిబ్బంది

సామర్లకోట: రానున్న ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు ఈవీఎంలపై అవగాహన పెంచేందుకు ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో శుక్రవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక పంతం పద్మనాభం ఎలిమెంటరీ పాఠశాల వద్ద ఈవీఎంల వినియోగంపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జె.రామారావు మాట్లాడుతూ ఈవీఎంలో ఓటు వేసిన సమయంలో ఏ గుర్తుకు ఓటు వేస్తే ఆ గుర్తు స్పష్టంగా కనిపిస్తుందన్నారు. దీనివల్ల ఎటువంటి అపోహలు పడాల్సిన అవసరం ఉండదన్నారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ అధికారులు, పోలింగ్ కేంద్రాల సూపర్‌వైజర్లు, వీఆర్వోలు, బీఎల్వోలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశాలు

సామర్లకోట: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు తెలిపారు. పురపాలక పరిధిలో అభివృద్ధి పనుల తీర్మానానికి గాను అజెండాలో 12 అంశాలను పొందుపరిచామన్నారు. సమావేశానికి చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షత వహిస్తారని, కౌన్సిల్ సభ్యులు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

పెద్దాపురం: పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సాధారణ సమావేశం శనివారం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర తెలిపారు. ఉదయం 10.30 గంటలకు చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన మొదలయ్యే సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న పెద్దాపురం ఆర్డీఓ రామారావు

పెద్దాపురం: జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తామని పెద్దాపురం ఆర్డీఓ జేఎస్ రామారావు అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్ (ప్రింట్ మీడియా) ఆధ్వర్యంలో శుక్రవారం క్లబ్ సభ్యులకు తపాలా శాఖ ఆధ్వర్యంలో పోస్టల్ బీమా కార్డుల పంపిణీ, నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్లబ్ అధ్యక్షుడు రాకుర్తి రాంబాబు అధ్యక్షతన జరిగిన క్యాలెండర్ ఆవిష్కరణలో ఆర్డీఓ మాట్లాడుతూ జర్నలిస్టులకు ప్రభుత్వం అందిస్తున్న ఇళ్ల స్థలాలను అర్హులందరికీ మంజూరు చేస్తామన్నారు. ఎంపీడీఓ బి.అశోక్‌కుమార్, ఈఓపీఆర్డీ కె.రాజశేఖర్, క్లబ్ కార్యదర్శి ఎన్‌పీఎస్ వినాయక్, తపాలా శాఖ సిబ్బంది చదలాడ, గుడివాడ బీపీఎంలు రవి, ఎం.వెంకటేశ్వరరావు, క్లబ్ గౌరవాధ్యక్షుడు మొల్లు సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడు చవ్వాకుల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి



శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకట నారాయణ

కొత్తపల్లి: అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని ఎంపీడీఓ వెంకట నారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉపాధి హామీ మేట్లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేట్లు కూలీలకు సరాసరి వేతనం రోజుకు రూ.272 వచ్చే విధంగా కొలతల ప్రకారం పని కల్పించాలన్నారు. మార్కింగ్ తప్పని సరి అన్నారు. మస్తర్లు, ఈ మస్తర్లపై శిక్షణ ఇచ్చామన్నారు. ముఖ్యంగా గ్రామ సచివాలయాల పరిధిలో నిర్మిస్తున్న గ్రామ సచివాలయాలు, ఆరోగ్య కేంద్రాలు, రైతు భరోసా కేంద్రాల భవనాలపై కూడా శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

చిగురించిన ఆశలు

- ఆశాజనకంగా మామిడి, జీడి మామిడి పూత
- రైతులు అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు

పిఠాపురం: ఈ ఏడాది మామిడి, జీడి మామిడి చెట్లు రైతులను కలవరపెట్టినా చివరకు పూత దశలో ఆశలు చిగురింపజేశాయి. ఎక్కడ చూసినా మామిడి చెట్లు విరగబూసి కనిపిస్తుండడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే మంచు ఎక్కువగా ఉండడంతో దిగుబడిపై ప్రభావం చూపుతుందని ఆందోళన చెందుతున్నారు.

మంచు ప్రభావం ఉన్నా..

అధిక వర్షాలతో కొంత కాలం పూత లేక మామిడి చెట్లు వెలవెలబోగా ప్రస్తుతం విరగబూసిన మామిడి చెట్లు కనువిందు చేస్తున్నాయి. ఇటీవల పొగమంచు ప్రభావం పెరగడంతో పాటు ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థితికి పడిపోతుండడంతో పూత రాలిపోవడంతో పాటు మాడిపోయే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీనికి తోడు మంగు తెగులు సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా పిఠాపురం నియోజకవర్గంలో పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాలో సుమారు 2 వేల హెక్టార్లలో మామిడి తోటలు సాగవుతుండగా పూత ఆశాజనకంగా ఉన్నా మంచు ప్రభావం కలవరపెడుతోం



మామిడి చెట్టుకు విరగబూసిన పూత

దంటున్నారు. ఏటా నవంబరు, డిసెంబరు మాసాల్లో మామిడి పూత ప్రారంభమవుతుంది. ఈ ఏడాది ఈ రెండు నెలల్లోను పూత వచ్చే సమయంలో ఆటంకాలు ఏర్పడి పూత ఆలస్యమైంది. ఈ నేపథ్యంలో ఉద్యానవన శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. మామిడి అధికంగా ఉన్న ప్రాంతాల్లో తోటబడులు నిర్వహించి మామిడిలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు వివరిస్తున్నారు. ప్రస్తుతం ఆలస్యంగా మామిడి పూత వచ్చినందున రైతులు సస్యరక్షణ చర్యలు అవలంబించాలని పిఠాపురం ఉద్యానవన శాఖ అధికారి శైలజ తెలిపారు.

తెగుళ్లు, నివారణా చర్యలు

మామిడి, జీడి మామిడి తోటల్లో తామర పురుగులు, తేనెమంచు పురుగుల నివారణకు తోటలను కలుపు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలి. వేప నూనె, క్రిమి సంహారక మందులైన ఇమిడాక్లోప్రిడ్ 0.3 మిల్లీ లీటర్లు, మోనోక్రోటోఫాస్ ఒక మిల్లీ లీటరు, ఎసిఫేట్ 1.5 గ్రాములు వంటివి మార్చి మార్చి చెట్టు అంతా తడిసేలా పూత నల్లబడిన తరువాత పిందె ఏర్పడే సమయంలో పిచికారీ చేసుకోవాలి.

సస్యరక్షణ చర్యలు తప్పనిసరి



ప్రస్తుతం మామిడి పూత ఆశాజనకంగా ఉంది. సాధారణ సమయం కంటే కొంత ఆలస్యంగా పూత వచ్చినా మంచు ప్రభావం కొంత ఇబ్బంది పెట్టే అవకాశాలు ఉంది. రైతులందరూ తగిన సస్యరక్షణ చర్యలు పాటించాలి. ఉద్యానవన శాఖ ద్వారా మామిడి జీడి మామిడి రైతులకు యాజమాన్య పద్ధతులు తెలపడంతో పాటు తగిన సూచనలు, సలహాలు ఇస్తున్నాం. మామిడి, జీడి మామిడి తోటలలో ఎటువంటి మార్పులు గమనించినా వెంటనే స్థానిక ఉద్యానవన శాఖ సిబ్బందిని సంప్రదించాలి. ప్రస్తుతం పూత వచ్చి పిందె తయారయ్యే సమయం కావడంతో తగిన సస్య రక్షణ చర్యలు తప్పనిసరిగా పాటిస్తే పిందె నిలబడి దిగుబడి లభిస్తుందన్నారు. మామిడి పిందెలు బటాని గింజ పరిమాణంలో ఉన్నప్పుడు 10 గ్రాముల యూరియా లీటర్ నీటిలో కలిపి 20 నుంచి 30 రోజుల కొకసారి మామిడి చెట్లు తడిసేలా పిచికారీ చేయాలి. దీని వల్ల పిందె రాలడం తగ్గుతుంది. ముఖ్యంగా మామిడి తోటలు నీటి ఎద్దడికి గురి కాకుండా చూసుకోవాలి. తేలిక పాటి తడులు ఇవ్వాలి. ప్లానోఫిక్స్ హార్మోన్ 1 మిల్లీ లీటరు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

– శైలజ, పిఠాపురం ఉద్యాన శాఖ అధికారి

అపురూపమమ్మా..

- నూకాలమ్మకు ప్రత్యేక పూజలు
- పాల్గొన్న దవులూరి దొరబాబు

సామర్లకోట: నీ దివ్యరూపం.. అపురూపమమ్మ అంటూ ఆ నూకాలమ్మ అమ్మవారిని భక్తులు కొలిచి తరించారు. స్థానిక స్టేషన్ సెంటర్‌లో వేంచేసి ఉన్న నూకాలమ్మ ఆలయంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ దేవతగా ప్రసిద్ధి చెందిన నూకాలమ్మకు ధనుర్మాసం సందర్భంగా ఆలయంలో పూజలు నిర్వహిస్తున్నారు. తొలుత దొరబాబుకు ఆలయ ధర్మకర్త వల్లూరి బుల్లియ్య స్వాగతం పలికారు. ఆలయ ప్రధానార్చకుడు దేవళ్ల సాయికుమార్ పూజా కార్యక్రమాలు చేశారు. శరన్నవరాత్ర ఉత్సవాల ముగింపును పురస్కరించుకొని ఆలయంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనను దొరబాబు ప్రారంభించారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గుణ్ణం రాజబ్బాయి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మద్దాలి శ్రీను, కౌన్సిలర్ యార్లగడ్డ జగదీష్,



పెద్దాపురంలో మరిడమ్మకు బంగారు, వెండి పుష్పాలతో పూజలు చేస్తున్న పండితులు



సామర్లకోటలో నూకాలమ్మను దర్శించుకుంటున్న దవులూరి దొరబాబు

ఆలయ కమిటీ సభ్యులు యార్లగడ్డ శ్రీనివాసు, పెనుమర్తి పెద్దబ్బు, గోలి రాంబాబు, మార్ని శ్రీను, బోమ్మాలరావు, బోళ్ల శేఖర్, మాజీ కౌన్సిలర్ చంద్రు బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

బంగారు పుష్పాలతో మరిడమ్మకు పూజలు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ ఆలయంలో అమ్మవారికి బంగారు, వెండి పుష్పాలతో పూజలు చేశారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో ప్రతి వారం నిర్వహించే పూజల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమంతో పాటు బంగారు, వెండి పుష్పాలతో పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మైక్రో బ్యాక్టీరియాతో కుష్ఠు వ్యాధి

డిప్యూటీ పారా మెడికల్ అధికారి లక్ష్మణ

కొత్తపల్లి: కుష్టువ్యాధి అనేది అంటు వ్యాధి, అంటించుకునే వ్యాధి కాదని, శరీరంలో వ్యాధి నిరోధక శక్తి తగ్గడం వల్ల మైక్రో బ్యాక్టీరియా కారణంగా వస్తుందని డిప్యూటీ పారా మెడికల్ అధికారి లక్ష్మణ అన్నారు. జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా ఉప్పాడలో జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కుష్ఠు వ్యాధి నిర్మూలనా కార్యక్రమం ఈ నెల 27తేదీ నుంచి జనవరి 12 తేదీ వరకూ జరుగుతుందన్నారు. ప్రతి రోజూ ఆశా కార్యకర్తలు, వలంటీర్లు ఇంటింటికీ తిరగి 30 గృహాలు సర్వే చేయాలన్నారు. ఆ కుటుంబంలో చర్మ వ్యాధులు, అంగవైకల్యం ఉన్న వారిని గుర్తించి ఏఎన్‌ఎం యాప్‌లో నమోదు చేస్తే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి యాప్‌కు చేరుతుందన్నారు. ఈ విధంగా గుర్తించిన వారిలో కుష్టువ్యాధి నిర్ధారణ అయితే మొదటి దశలోనే చికిత్స అందించడం సులభతరమవుతుందని తెలిపారు. ముఖ్యంగా చర్మంపై స్పర్శలేని మచ్చలు, మందంగా మెరుస్తూ జిడ్డుగా ఉండే చర్మం, చెవులు, వీపు, చాతిపై నొప్పిలేని బొడిపెలు, కనుబొమ్మలు, రెప్పలపై వెంట్రుకలు రాలిపోవడం, కనురెప్పలు మూత పడకపోవడం,



ఉప్పాడలో కుష్ఠు వ్యాధిపై సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

ముక్కు దిబ్బడ, ముక్కు నుంచి రక్తం కారడం, కాళ్లు చేతులు తిమ్మిర్లతో పాటు ఝుమ్మనడం, చల్లని, వేడి పదార్థాలను గుర్తించలేక పోవడం, చేతి నుంచి వస్తువులు జారిపోవడంతోపాటు, చెప్పులు జారిపోవడం వంటి లక్షణాలు ఉన్న వారిని తప్పని సరిగా గుర్తించాలన్నారు. జిల్లాలో 67 కేసులు ఉన్నాయన్నారు. రెండు రకాల చికిత్సలు ఉంటాయని ఒకటి 6నెలలు, రెండవది 12నెలలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ పారా మెడికల్ అధికారులు, జి.అప్పలరాజు, జి.శ్రీను, వైద్య సిబ్బంది వెంకటేష్ తదితరులు ఉన్నారు.

ఆవును ఢీకొని వ్యాన్ బోల్తా

పిఠాపురం: స్థానిక పిఠాపురం రాపర్తి సెంటర్ వద్ద శుక్రవారం రాత్రి కత్తిపూడి వైపు నుంచి కాకినాడ వెలుతున్న వ్యాన్ ప్రమాదావశాత్తు ఒక ఆవును ఢీకొని బోల్తా పడింది. పోలీసులు కథనం ప్రకారం వ్యాన్ వేగంగా వస్తుండగా ఒక నల్లని ఆవు హఠాత్తుగా రోడ్డుపైకి రావడంతో వ్యాన్ ఢీకొట్టింది. దీంతో వ్యాన్ అదుపు తప్పి బోల్తా పడడంతో డ్రైవరుకు గాయాలవ్వగా అతనిని కాకినాడలో ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో ఆవు మృతి చెందింది. పిఠాపురం పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆరుగురిపై అట్రాసిటీ కేసు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలు భూ వివాదంలో ప్రత్యేర్థులు ఇచ్చిన ఫిర్యాదుపై ఆరుగురు వ్యక్తులపై ఆరుగురిపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు గొల్లప్రోలు ఎస్సై వినయ్ ప్రతాప్ శుక్రవారం తెలిపారు. చేబ్రోలు శివారు భూమిలో ఉన్న గృహాలు, దుకాణాలపై గత రెండు రోజుల క్రితం కొందరు గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి ధ్వంసం చేసిన సంఘటనలో తమపై దౌర్జన్యం చేసి కులం పేరుతో దూషించారని చేబ్రోలుకు చెందిన తిరగటి కుమారి ఇచ్చిన ఫిర్యాదుతో ఆరుగురు వ్యక్తులపై అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రబీలో నాణ్యమైన దిగుబడులు సాధించాలి

పెద్దాపురం: ప్రస్తుత రబీ సీజన్‌లో రైతులు మంచి దిగుబడులు సాధించేందుకు శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖాధికారులు సలహాలు, సూచనలు అందించాలని సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ పి.మునిరత్నం అన్నారు. స్థానిక ఏరువాక కేంద్రంలో శుక్రవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని వ్యవసాయాధికారులకు శిక్షణ, సందర్శన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరువాక కోఆర్డినేటర్ సీహెచ్‌వీ నరసింహారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మునిరత్నం మాట్లాడుతూ ప్రస్తుత రబీలో నాణ్యమైన దిగుబడులు సాధించే దిశగా రైతులను చైతన్యవంతం చేయాలన్నారు. వరిలో అక్కడక్కడా ఎండాకు తెగులు, సుడిదోమ ఆశించే అవకాశం ఉండడంతో రైతులను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ నరసింహారావు మాట్లాడుతూ ప్రస్తుత వ్యవసాయ స్థితిగతులను వివరించారు. అనంతరం పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. శిక్షణలో జిల్లా వ్యవసాయాధికారులు విజయ్‌కుమార్, హరి, జ్యోతిర్మయి, శాస్త్రవేత్తలు నందకిశోర్, శర్మ, సుధీర్, రమణారావు, సుజాత, అనూష తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ మునిరత్నం

ఆయిల్‌పామ్ సాగులో మెళకువలు



సదస్సులో మాట్లాడుతున్న పిఠాపురం ఉద్యాన శాఖాధికారి శైలజ

పిఠాపురం: ఆయిల్‌పామ్ సాగులో విధిగా మెళకువలు పాటించాలని, తద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని పిఠాపురం ఉద్యాన శాఖాధికారి కేఎస్ శైలజ రైతులకు సూచించారు. పిఠాపురం మండలం కోలంకలో శుక్రవారం ఉద్యాన శాఖ, పెద్దాపురం పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆయిల్‌పామ్ రైతుల అవగాహనా సదస్సులో ఆమె రైతులకు పలు సూచనలు ఇచ్చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీలు ఇస్తున్న బిందు సేద్యం, మొక్కలు, ఎరువుల రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొక్కలు పెంపకం, తెగుళ్ల నివారణ, గెలల కోతలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బిందుసేద్యం, నాణ్యతల గురించి రైతులకు వివరించారు. ఈకార్యక్రమంలో పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ కంపెనీ మేనేజర్ కె వెంకటేశ్వరరావు, వీఏఏలు పి.భాస్కర్, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ కంపెనీ క్షేత్ర సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం లేని నూతన సంవత్సరాన్ని ఆహ్వానిద్దాం

పిఠాపురం: మద్యం లేని నూతన సంవత్సరాన్ని మనసారా ఆహ్వానిద్దాం అంటూ పిఠాపురం మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ, జన విజ్ఞాన వేదిక సభ్యులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పిఠాపురంలో మద్యపానం ఆరోగ్యానికి హానికరం మద్యాన్ని నిషేధించండి, మానవాళిని రక్షించండి అంటూ ప్రచురించిన పోస్టర్‌ను డాక్టర్ పీఎస్ రాజు ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో పిఠాపురం మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ, జన విజ్ఞాన వేదిక సభ్యులు, ఎస్.సూర్యనారాయణ, నేమిశెట్టి గంగబాబు, వి.సత్యనారాయణరెడ్డి, కొమ్మనాపల్లి అప్పారావు, ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.కేశవరావు, వి.తరుణ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పిఠాపురం మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ, జనవిజ్ఞాన వేదిక సభ్యులు

టీడీపీ.. ఇదేం తీరు!

- భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా ఎన్టీఆర్ విగ్రహం వద్ద రాజకీయం
- ప్రతిఘటించిన భక్తజనం

కాకినాడ: ఎన్టీఆర్ విగ్రహాన్ని అడ్డుపెట్టుకుని భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా టీడీపీ వ్యవహరించడంతో ఆ పార్టీ శుక్రవారం కాకినాడలో అభాసుపాలైంది. ఓ వైపు భక్తులు భజనలు చేస్తోంటే, ఆలయం వైపు టీడీపీ కేడర్‌తో మోహరించి అరుపులు, కేకలు, ఈలలు వేస్తూ రోడ్డుపై బైఠాయించడంతో భక్తుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వచ్చింది. ఆ వివరాల్లోకి వెళ్తే.. కాకినాడ సంతచెరువు వద్ద కనకదుర్గమ్మ ఆలయాన్ని రూ.2 కోట్లతో పునర్నిర్మిస్తున్నారు. ఈ క్రమంలో ఆలయం ఆవరణలో రాజగోపురానికి అడ్డుగా ఉన్న ఎన్టీఆర్ విగ్రహాన్ని మూడు మీటర్లు పక్కకు జరిపేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ప్రదక్షిణలకు అవరోధంగా ఉండటంతో భక్తుల విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న టీడీపీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ఇతర నేతలు ఆలయం వద్దకు చేరుకుని విగ్రహాన్ని పక్కకు జరిపే ప్రక్రియకు అడ్డుతగిలారు. విగ్రహాన్ని తొలగించే ఉద్దేశం లేదని, పక్కకు మాత్రమే జరుపుతున్నామని ఆలయ ప్రధాన దాత, అభివృద్ధి కమిటీ చైర్మన్ జొన్నాడ చినబాబు, మాజీ కార్పొరేటర్ ఎంజీకే కిశోర్, యువ నాయకులు గణపతి, హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు అంకాడి సత్తిబాబు తదితరులు టీడీపీ నేతలకు స్పష్టం చేశారు. అయితే ఈ అంశాన్ని రాజకీయంగా వాడుకుని లబ్ధి పొందాలని అక్కడకు వచ్చిన టీడీపీ నాయకులు పెద్ద పెద్ద కేకలు వేస్తూ ఆలయం పక్కనే ధర్నా చేసి విగ్రహం జరిపే ప్రక్రియను అడ్డుకున్నాయి. ఈ క్రమంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు కూడా అక్కడకు చేరుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య అరుపులు కేకలు, వాగ్వాదాలతో అక్కడి పరిస్థితి ఉద్రిక్తతగా మారింది. డీఎస్పీ మురళీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు అక్కడకు చేరుకుని ఇరువర్గాలకు సచ్చజెప్పారు. అయితే అదే సమయంలో ఆలయం వద్ద భక్తులు ఓ వైపు భజనలు చేస్తుండగా, వారికి ఆటంకం కలిగించేలా వ్యవహరిస్తూ ఆలయం వెలుపల టీడీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున ఈలలు, కేకలు వేస్తూ రసాభాస చేశారు. భక్తుల మనోభావాలను దెబ్బతినేలా టీడీపీ కేడర్ వ్యవహరించిన తీరు తీవ్ర విమర్శలకు తావిచ్చింది. భక్తులు కూడా టీడీపీ తీరును నిరసిస్తూ ఎదురు తిరగడంతో చివరకు అక్కడి నుంచి వెళ్లిపోయారు.



కనకదుర్గమ్మ ఆలయం వద్ద ఇరువర్గాల వాగ్వాదం

టీడీపీది కపట ప్రేమ: ద్వారంపూడి

కనకదుర్గమ్మ ఆలయం వద్ద ఎన్టీఆర్ విగ్రహాన్ని అడ్డుపెట్టుకుని టీడీపీ ఎన్టీఆర్‌పై కపట ప్రేమ చూపించిందని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి విమర్శించారు. ఈ వివాదంపై ఎమ్మెల్యే ద్వారంపూడి విలేకర్ల వద్ద స్పందిస్తూ 20 ఏళ్లుగా ఆలయ పునర్నిర్మాణం కోసం ఎంతో మంది ప్రయత్నించినప్పటికీ ఇంతకాలానికి రూ. 2 కోట్లతో ఆరు నెలల్లోనే నిర్మాణం చేయగలిగామన్నారు. అయితే ఆలయానికి ఎన్టీఆర్ విగ్రహం అడ్డుగా ఉండడంతో పక్కకు మాత్రమే జరిపేందుకు ప్రయత్నించారని, దీనిని రాజకీయం చేయాలని టీడీపీ చూసిందని మండిపడ్డారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన నాయకులే ఆయన పట్ల కపటప్రేమ చూపిస్తూ భక్తుల మనోభావాలను దెబ్బతినేలా వ్యవహరించారంటూ విమర్శించారు. ఇటువంటి వ్యవహార శైలిపై హిందూ సంస్థలు స్పందించాలని పిలుపునిచ్చారు. విగ్రహాన్ని ఆవిష్కరించిన వారి పేర్లతో సహా పక్కకు మార్పు చేస్తున్నామని, దీనిని కూడా స్వార్థం కోసం వినియోగించుకుంటూ వ్యవహరిస్తున్న తీరు అత్యంత బాధాకరమన్నారు. ఎన్టీఆర్ విగ్రహాన్ని యథాతథంగా ఉంచామని, ఇలాంటి రాజకీయాలు చేస్తే తాము తగిన రీతిలో స్పందించాల్సి వస్తుందని ఎమ్మెల్యే హెచ్చరించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

పిఠాపురం: ప్రజా సంక్షమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. ఆయన శుక్రవారం నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పిఠాపురం మండలం బి.కొత్తూరులో జలజీవన్ మిషన్ నిధులు రూ.85.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఇంటింటికీ కుళాయి కనెక్షన్ పనులకు, వాటర్ టాంకు నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. నర్సింగపురంలో రూ.89 లక్షలతో నిర్మించనున్న ఇంటింటికి కుళాయి కనెక్షన్ పనులకు, వాటర్ ట్యాంకు నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కోలంకలో రూ.76 లక్షలతో నిర్మించనున్న కుళాయి కనెక్షన్ పనులకు, వాటర్ ట్యాంకు నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. మాధవపురంలో రూ.72.30 లక్షలతో నిర్మించనున్న కుళాయి కనెక్షన్ పనులకు, వాటర్ టాంకు నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం గడప గడపకూ మన ప్రభుత్వం నిధులతో నిర్మించిన నూతన సీసీ డ్రైన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన సంక్షేమ ఫలాలు అందరికీ సమానంగా అందించడం కోసమే వలంటీర్ వ్యవస్థను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చారన్నారు. ఆయన ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ప్రతి పథకం ప్రతీ పేదవారికి నేరుగా వారి ఇంటికే చేరరుతున్నాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు జవ్వాది నాయుడు, వైఎస్సార్ సీపీ నేతలు ఉలవల భూషణం, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాధవపురంలో డ్రైన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే పెండెం దొరబాబు

గొల్లప్రోలులో ఇరువర్గాల మధ్య ఘర్షణ

ఒక వ్యక్తికి తీవ్ర గాయాలు

పిఠాపురం: తనకు ఇవ్వాల్సిన డబ్బులు అడగంతో బాకీ ఉన్న వ్యక్తి మరి కొంత మందితో కలిసి దాడి చేయడంతో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన గొల్లప్రోలులో శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం పిఠాపురం మండలం బి.ప్రత్తిపాడుకు చెందిన మొగలి అజయ్‌కు గొల్లప్రోలుకు చెందిన మాదేపల్లి నానాజీ అనే వ్యక్తి డబ్బులు బాకీ ఉన్నాడు. దీంతో శుక్రవారం రాత్రి గొల్లప్రోలు రాయవరం సెంటర్లో ఒక హోటల్ వద్ద ఉన్న నానాజీని అజయ్ కలిసి తన డబ్బులు ఇవ్వాలని అడిగాడు. దీంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి వివాదానికి దారి తీసింది. ఈనేపథ్యంలో నానాజీ సోదరుడు నాగేశ్వరరావు ఇతర కుటుంబ సభ్యులు అక్కడకు వచ్చి అజయ్‌పై దాడికి దిగారు. విషయం తెలుసుకున్న అజయ్ బంధువులు అక్కడకు రావడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వివాదం చోటు చేసుకుంది. ఈ వివాదంలో అజయ్‌కు తీవ్ర గాయాలవ్వగా అతనిని పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి చికిత్స కోసం తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఇరు వర్గాలను చెదరగొట్టారు. గొల్లప్రోలు ఎస్సై వినయ్ ప్రతాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సంఘటన స్థలంలో జనాన్ని చెదరగొడుతున్న పోలీసులు